సాక్షి
జనగామ

శుక్రవారం । 9 । ఆగస్టు । 2024



పదోన్నతులకు లైన్ క్లియర్..

విద్యుత్ సంస్థల్లో పదోన్నతులకు ప్రభుత్వం నుంచి లైన్‌క్లియర్ అయింది. దీంతో ఉద్యోగుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. - 8లో▸



పురాతన ఆలయాలకు పూర్వవైభవం

కాకతీయుల నాటి దేవాలయాలను పునరుద్ధరించి చారిత్రక కోటకు పూర్వవైభవం తీసుకురానున్నట్లు దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ అన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$33^0/25^0$

వాతావరణం

ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం అక్కడక్కడా మేఘావృతమై జల్లులు కురిసే అవకాశం ఉంది. మధ్యాహ్నం సమయంలో సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

న్యూస్‌రీల్

తెలంగాణ ఉద్యమకారుడికి సత్కారం



జనగామ: తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం జరిగిన మలి దశ ఉద్యమంలో ముందుండి పోరాటం చేసిన జనగామ పట్టణానికి చెందిన ఉడుత రవియాదవ్‌ను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క సన్మానించారు. గురువారం హైదరాబాద్ సచివాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో సాంస్కృతిక మండలి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు గడ్డం సుధాకర్ పాల్గొన్నారు.

ఆయిల్‌పాం సాగుతో అధిక లాభాలు



పాలకుర్తి: ఆయిల్‌పాం సాగుతో అధిక లాభాలు పొందవచ్చు.. రైతులు ఆ దిశగా దృష్టి సారించాలని ఉద్యాన, పట్టుపరిశ్రమ విభాగం జిల్లా అధికారి శ్రీధర్‌రావు అన్నారు. ముత్తారం గ్రామానికి చెందిన రైతు అనంతరావు సాగు చేసిన ఆయిల్‌పాం తోటలో గురువారం కోతను ప్రారంభించి మాట్లాడారు. 36 ఎకరాల్లో సాగు చేసిన ఆయిల్‌పాం తోట 34వ నెలలో కోతకు వచ్చిందని, రూ.5 లక్షలు ఆదాయం సమకూరిందని చెప్పారు. రైతులు సాగుకు ముందుకు వస్తే ప్రభుత్వ పరంగా సబ్సిడీ అందజేస్తుందని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యానవన అధికారి ధీరజ్, ఆయిల్ ఫెడ్ అధికారి వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ గురుకులాల్లో ప్రవేశ గడువు పెంపు

జనగామ రూరల్: మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలల్లో ప్రవేశ గడువు పొడిగించినట్లు మైనార్టీ సంక్షేమాధికారి రవీందర్ ఒక ప్రటకన లో తెలిపారు. జనగామలోని మైనార్టీ బాలుర పాఠశాలలో 5,6,7,8వ తరగతులు, స్టేషన్‌ఘన్‌పూర్ బాలికల పాఠశాల, జనగామ మండలం శామీర్‌పేట, స్టేషన్‌ఘన్‌పూర్‌లోని మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల, జూనియర్ కళాశాలలో ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈనెల 16వ తేదీ వరకు గడువు పొడిగించామని, మరిన్ని వివరాలకు 9346677568, 9912230123, 9441903130 నంబర్లలో సంప్రదించాలని ఈ సందర్భంగా సూచించారు.

వసతి గృహాల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

జనగామ రూరల్: జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాల, కళాశాల వసతి గృహాల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా బీసీ సంక్షేమాధికారి రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 10 పాఠశాల వసతి గృహాలు, 6 కళాశాల వసతి గృహాలు ఉన్నాయని, ఈనెల 20వ తేదీలోగా సంబంధిత సర్టిఫికెట్లతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9492880366, 7386745456 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

బడ్జెట్ కేటాయింపుల్లో పక్షపాత ధోరణి



జనగామ రూరల్: బడ్జెట్ కేటాయింపుల్లో ప్రధాని మోదీ పక్షపాత ధోరణి అవలంబిస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కెళ్లపల్లి శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన పార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ సంపదను బూర్జువా పార్టీలు దోచుకుని సంపన్నులకు పంచిపెడుతున్నాయని విమర్శించారు. రాష్ట్ర పునర్విభజనలో తెలంగాణకు తీవ్ర అన్యాయం చేశారని, ఆంధ్రప్రదేశ్, బిహార్ రాష్ట్రాలకు అధిక నిధులు ఇవ్వడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాపాలనపై బీఆర్‌ఎస్ తప్పుడు ప్రచారం మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి రాజారెడ్డి, రాంరెడ్డి, సుగుణమ్మ, శ్రీనివాస్, జనార్దన్ సోమయ్య, సదానందం, రమేష్, ఎల్లయ్య పాల్గొన్నారు.

శ్రమకు తగిన ఫలితమేది..?

- మల్టీపర్పస్ కార్మికుల వెట్టిచాకిరీ
- చాలీచాలని వేతనాలతో అవస్థలు
- ఏళ్ల తరబడి తప్పని ఎదురుచూపులు
- కనీస వేతనం, ఉద్యోగ భద్రతకు డిమాండ్
- జిల్లాలో 1,080 మంది కార్మికులు

జనగామ రూరల్: గ్రామాల్లో ప్రజలకు ఆరోగ్యవంతమైన వాతావరణం కల్పిస్తున్న మల్టీపర్పస్ కార్మికుల సమస్యలు వర్ణనాతీతం. చాలీచాలని వేతనం.. అదికూడా సమయానికి చేతికందక కుటుంబాలు గడవక కోట్టు మిట్టాడుతున్నారు. తమ డిమాండ్ల సాధనకు గత ఏడాది సమ్మె చేసినా ఫలితం దక్కలేదు. రాష్ట్రంలో నూతనంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా పట్టించుకుంటుందనే గంపెడాశతో ఎదురుచూస్తున్న వీరు.. గురువారం జిల్లా వ్యాప్తంగా ఒకరోజు సమ్మె చేపట్టారు.

1,080 మంది జీపీ కార్మికులు..

జిల్లాలో మొత్తం 281 గ్రామ పంచాయతీలు ఉండగా 1,080 మంది జీపీ కార్మికులు(మల్టీపర్పస్) విధులు నిర్వహిస్తున్నారు. అవసరం ఉన్న వర్కర్ల కంటే 25 శాతం తక్కువగా ఉన్నారు. దీంతో పనిభారం పడుతోంది. మల్టీపర్పర్ కార్మికులతో అనేక పనులు చేయించుకుంటున్నా చెల్లించేది అరకొరే. ఒక్కో కార్మికుడికి మొదట నెలకు రూ.8.500 ఇచ్చే వారు. రెండు నెలల క్రితం ప్రభుత్వం రూ.1,000 పెంచింది. రూ.9,500 చొప్పున వేతనం చెల్లించాలని ఆదేశాలున్నాయి. అయితే స్థానిక అవసరాలను బట్టి నియమించుకున్న కార్మికులకు వీరి వేతనాల నుంచే చెల్లిస్తున్నారు. దీంతో కనీస అవసరాలు కూడా తీరని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే పలు గ్రామాల్లో మూడు నుంచి ఐదు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి.



గురువారం చేపట్టిన ఒక రోజు సమ్మెలో నినాదాలు చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

చేపట్టే పనులు

గ్రామంలో ముఖ్యంగా పారిశుద్ధ్య పనులు, చెత్త తొలగింపు, ట్రాక్టర్ నిర్వహణ, వీధి లైట్లు, తాగునీటి సరఫరా వంటి పనులు చేపట్టడంలో మల్టీపర్పస్ కార్మికులు కీలకంగా ఉంటారు. అంతేకాకుండా ప్రభుత్వ కార్యాక్రమాల్లో వారు లేనిదే పనులు జరగవు. ఆరు నెలల నుంచి ప్రజా ప్రతినిధులు లేకపోవడంతో నిధులు లేక పనుల నిర్వహణకు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో వీరికి 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి వేతనాలు చెల్లించే వారు. ప్రస్తుతం ఆ నిధులు నిర్ణీత వ్యవధిలో అందడం లేదు.

ఇవీ కార్మికుల డిమాండ్లు

- జీపీ కార్మికులను పర్మనెంట్ చేయాలి
- జీఓ 60 ప్రకారం స్వీపర్లకు రూ.15,600, బిల్ కలెక్టర్, కారోబార్లకు రూ.19,500 ప్రతి నెలా రెగ్యులర్‌గా చెల్లించాలి.
- జీఓ 51ని సవరించి మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలి
- ప్రతి కార్మికుడికి ప్రమాద బీమా రూ.10 లక్షలు, దహన సంస్కారాలకు రూ.30 వేలు ఇవ్వాలి.
- రిటైర్మెంట్ బెనిఫిట్ కింద రూ.5 లక్షలు చెల్లించాలి.
- ఏడాదికి మూడు జతల యూనిఫామ్, చెప్పులు, సబ్బులు, నూనెలు తదితరాల కొనుగోలుకు నగదు రూపంలో అలెవెన్స్ చెల్లించాలి.
- ఈఎస్‌ఐ, పీఎఫ్ సదుపాయం కల్పించి 8 గంటల పని విధానం అమలు చేయాలి.
- అక్రమ తొలగింపులు ఆపి రక్షణ కల్పించాలి.

న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలి



జీపీ కార్మికులతో గ్రామాల్లో అన్ని రకాల పనులు చేయించుకుంటూ సరైన వేతనాలు ఇవ్వకపోవడం దారుణం. ఇచ్చే అరకొర వేతనం మూడు నెలల నుంచి రాకపోవడంతో ఇల్లు గడవడం భారంగా మారింది. న్యాయమైన డిమాండ్‌లు నెరవేర్చాలి.

- ఎస్‌కే.పాషా, కారోబార్, శామీర్‌పేట

మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలి



ఏళ్ల తరబడి ప్రజలకు సేవలందిస్తున్నాం. గత ప్రభుత్వం కొంత జీతాలు పెంచినా ఎటూ సరిపోవడం లేదు. ఉద్యోగ భద్రత కల్పించడంలేదు. కొత్త ప్రభుత్వం వచ్చినా కార్మికులను పట్టించుకోవడం లేదు. మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలి.

- మల్లాచారి, కారోబార్, గోపిరాజుపల్లి

ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నం..



నిత్యావసరాల ధరలు పెరుగుతున్నాయి. ఇచ్చే అరకొర జీతం ఎటూ సరిపోవడం లేదు. సమయానికి అందడంలేదు. భర్త మరణించాడు. నాకు నలుగురు పిల్లలు. ఆస్తి పాస్తులు లేవు. పెంకుటింట్లో తలదాచుకుంటున్నం. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నం.

- పిడుగు సుజాత, కార్మికురాలు, ఓబుల్‌కేశ్వాపూర్

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు

- సీపీ అంబర్ కిషోర్ ఝూ



సీపీ అంబర్ కిషోర్ ఝూ

వరంగల్ క్రైం : కాలేజీల్లో విద్యార్థులు ర్యాగింగ్ లాంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ హెచ్చరించారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యార్థులు తమ భవిష్యత్‌ను నిర్మించుకోవడంలో కళాశాల క్యాంపస్ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని కళాశాలలోని తోటి విద్యార్థులతో స్నేహపూరిత వాతావరణం ఉండే విధంగా చూసుకోవాలని పేర్కొన్నారు. ర్యాగింగ్ అనేది అత్యంత అమానుష చర్యని, తోటి విద్యార్థులతో అసభ్యంగా ప్రవర్తించడం, వారిని ఇబ్బందులకు గురిచేయడం మంచి విద్యార్థి లక్షణం కాదని వివరించారు. ర్యాగింగ్ కేసుల్లో ఇరుక్కుంటే విద్యార్థులు బంగారు భవిష్యత్ కోల్పోతారని హెచ్చరించారు. కళాశాల యాజమాన్యంతో పాటు అధ్యాపకులు తరచూ కొత్తగా చేరిన విద్యార్థులతో సంప్రదిస్తూ వారిలో ర్యాగింగ్ మహమ్మారిని వ్యతిరేకించే విధంగా ఆత్మవిశ్వాసం, ధైర్యం పెంపొందించాలని సూచించారు. ఎవరైనా కళాశాలల్లో ర్యాగింగ్‌కు పాల్పడినా, ర్యాగింగ్ గురవుతున్నట్లు అనిపించినా విద్యార్థులు మౌనంగా ఉండకుండా తక్షణమే డయల్ 100 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

న్యాయవాదుల దీక్షలు

- మూడోరోజూ కోర్టు విధుల బహిష్కరణ



దీక్షలో కూర్చున్న న్యాయవాదులు

జనగామ: జనగామ పోలీస్‌స్టేషన్‌లో న్యాయవాద దంపతులపై జరిగిన దాడిని నిరసిస్తూ అడ్వకేట్లు గురువారం మూడో రోజు విధులను బహిష్కరించారు. జనగామ బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎనగందుల చంద్రరుషి ఆధ్వర్యాన కోర్టు ప్రాంగణంలో రిలే దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా చంద్రరుషి మాట్లాడుతూ చట్టాన్ని రక్షించాల్సిన వారే చేతుల్లోకి తీసుకుంటే న్యాయం ఎక్కడ ఉంటుందని ప్రశ్నించారు. న్యాయవాదులు అమృతరావు, కవితపై దాడికి పాల్పడిన సీఐ, ఎస్సై, సిబ్బందిని తక్షణమే సస్పెండ్ చేయాలని, చర్యలు ఆలస్యమైతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అడ్వకేట్ ప్రొటక్షన్ యాక్ట్ తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ బాలకిషన్ గౌడ్, జనరల్ సెక్రెటరీ నక్క సిద్దులు, ట్రెజరర్ చంద్రశేఖర్, లైబ్రరీ, స్పోర్ట్స్, కల్చరల్, మహిళా విభాగం సెక్రటరీలు గొంగిడి నరసింహులు, పసునూరి మురళి, నల్ల రేణుక, న్యాయవాదులు పాల్గొన్నారు.

జనగామ సీఐ, ఎస్సైపై వేటు.. కానిస్టేబుల్ ఏఆర్‌కు అటాచ్

జనగామ పీఎస్‌లో న్యాయవాద దంపతులపై దాడి చేశారనే ఆరోపణల నేపథ్యంలో సీఐ రఘుపతిరెడ్డి, ఎస్సై తిరుపతిని ఉమ్మడి వరంగల్ హెడ్‌క్వార్టర్స్‌కు బదిలీ చేయగా.. కానిస్టేబుల్ కరుణాకర్‌ను ఏఆర్‌కు అటాచ్ చేస్తూ సీపీ అంబర్ కిషోర్ ఝూ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. సీసీఎస్‌లో విధులు నిర్వహిస్తున్న దామోదర్‌రెడ్డిని జనగామ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్(సీఐ)గా బదిలీ చేశారు. ఆయన శుక్రవారం(నేడు) విధుల్లో చేరనున్నారు.

న్యాయవాద దంపతులపై కేసు నమోదు

జనగామ: న్యాయవాద దంపతులు అమృతరావు, కవిత.. సీఐ, ఎస్సై విధులకు ఆటంకం కలిగించడంతో పాటు బెదిరించడం, దురుసుగా ప్రవర్తించినట్లు జనగామ పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ మహ్మద్ సిరాజొద్దీన్ ఫరీద్ ఫిర్యాదు మేరకు ఎస్సై రాజేశ్‌కుమార్ కేసు నమోదుచేసినట్లు గురువారం తెలిసింది. వాస్తవానికి ఈనెల 6నే కేసు నమోదు కాగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జనగామ కోర్టుకు చెందిన న్యాయవాద దంపతులు తమ క్లైంట్ కేసు విషయమై ఈనెల 5న స్థానిక పోలీస్టేషన్‌కు వెళ్లారు. స్టేషన్‌లో జరిగిన గొడవతో న్యాయవాద దంపతులు బార్ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి సీఐ, ఎస్సై, ఇతర పోలీసు సిబ్బందిపై చర్య తీసుకోవాలని అదేరోజు డీసీపీ రాజమహేంద్రనాయక్‌కు ఫిర్యాదు చేశారు. ఈ డిమాండ్‌పై న్యాయవాదులు మూడురోజులుగా నిరసనలు, రిలే దీక్షలు చేస్తున్నారు. న్యాయవాద దంపతలకు రాష్ట్ర వ్యాప్తంగా బార్ అసోసియేషన్లు మద్దతు పలుకుతున్నాయి. ఈ నేపథ్యంలో 7వ తేదీ రాత్రి సీఐ, ఎస్సైలపై కేసు నమోదు చేయగా, సంఘటనకు సంబంధించి విచారణ అధికారిగా స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీంశర్మ ను నియమిస్తూ డీసీపీ ఆదేశాలు జారీ చేశారు. ముందే తాము ఫిర్యాదు చేసినా న్యాయవాద దంపతులపై కేసు నమోదు చేయడం హాస్యాస్పదంగా ఉందని జనగామ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రరుషి అన్నారు. ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మూడు రోజులుగా పోలీసులు వర్సెస్ న్యాయవాదుల మధ్య జరుగుతున్న వార్ ఇరువురిపై నమోదైన కేసులతో మరింత జఠిలంగా మారనుంది.

ప్రభుత్వ విద్యావ్యవస్థను బలోపేతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న చావా రవి

జనగామ రూరల్: ప్రభుత్వ విద్యావ్యవస్థను బలోపేతం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రావు ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంఈఓ పోస్టుల భర్తీ కోర్టు పరిధిలో ఉన్నందున ప్రత్యామ్నాయంగా పాఠశాలల పర్యవేక్షణ అధికారులను భర్తీ చేయాలని చెప్పారు. సామరస్యంగా ఏకీకృత సమస్యలు పరిష్కరించాలని, ఎంపీఓ పోస్టుల భర్తీ సాధ్యం కానిపక్షంలో దామాషా పద్ధతిన పంచాయతీరాజ్ ఉపాధ్యాయలకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రధాన కార్యదర్శి ఎ.శ్రీనివాస్‌కృష్ణ, వెంకట్, ఆగయ్య, రవీందర్, అమర్‌నాథ్, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

'విద్యాప్రదేశ్' మూల్యాంకన సర్వే పూర్తి

- మాట్లాడుతున్న డీఈఓ రాము



సర్వేలో పాల్గొన్న డీఈఓ రాము, అధికారులు

జనగామ/జనగామ రూరల్: పాఠశాలల్లో విద్యార్థుల నైపుణ్యాలను తెలుసుకోవడానికి కేంద్రం అమలు చేస్తున్న విద్యాప్రదేశ్ మూల్యాంకనం సర్వే పూర్తయిందని డీఈఓ రాము తెలిపారు. గురువారం ఆయన వివరాలు వెల్లడించారు. మూడు రోజుల పాటు గుణాత్మక విద్య సమన్వయ అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యాన జనగామ మండల పరిధి వెంకిర్యాల, పెంబర్తి, జిల్లా కేంద్రంలోని హరిజనవాడ ప్రాథమిక పాఠశాలల్లో సర్వే చేశామని చెప్పారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఒకటవ తరగతి నుంచి ఐదవ వరకు చదువుతున్న విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, అవగాహన స్థాయి, సామాజిక మానసిక ఎదుగుదల నైపుణ్యాలు తెలుసుకోవడానికి ఈసర్వే చేపట్టినట్లు పేర్కొన్నారు. సర్వే నివేదికను రాష్ట్ర పర్యవేక్షకురాలు ప్రొఫెసర్ హమామా కయూన్ ద్వారా ఢిల్లీకి పంపిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నవీన్, అనిల్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

శిశువుకు తల్లిపాలు అమృతం

- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



అన్న ప్రాసన చేస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ: శిశువుకు తల్లిపాలు అమృతంతో సమానం.. పుట్టిన గంటలోపు ముర్రుపాలు పట్టిస్తే శిశువు రోగ నిరోధక శక్తి పెరిగి ఆరోగ్యంగా ఎదుగుతారని కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా అన్నారు. పట్టణ పరిధి అంబేడ్కర్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం నిర్వహించిన అన్న ప్రాసన కార్యక్రమంలో మాట్లాడారు. ఆరు నెలలు దాటిన పిల్లలకు తల్లిపాలతో పాటు అనుబంధ ఆహారం ఇవ్వాలని సూచించారు. గర్భిణులు రోజువారీగా తీసుకునే ఆహారంలో ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, గుడ్లు, పాలు, గింజ ధాన్యాలు తీసుకుంటే పుట్టబోయే పిల్లలకు తీవ్ర, అతి తీవ్ర పోషణ లోపం లేకుండా ఉంటుందని పేర్కొన్నారు. ఈ విషయమై కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. మహిళలు, చిన్నారుల ఆరోగ్య వంతమైన జీవనం కోసం అంగనవాడీ కేంద్రాల్లో న్యూట్రీ గార్డెన్ ఏర్పాటు చేసి అందులో ఆకుకూరలు సాగు చేయాలన్నారు. అంతకు ముందు సెంటర్‌లో జామ మొక్క నాటి నీరు పోశారు. డీడబ్ల్యూఓ జయంతి, 14వ వార్డు కౌన్సిలర్ పేర్ని స్వరూప, సీడీపీఓ రమాదేవి, ఏసీడీపీఓ సత్యవతి, జనగామ అర్బన్ సూపర్‌వైజర్ పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ పక్కనే ఉన్న ప్రభుత్వ పాఠశాలకు చేరుకుని విద్యార్థుల పఠనా సామర్థ్యాన్ని పరిశీలించారు.

ఓటరు జాబితా సిద్ధం చేయండి

జిల్లాలో గ్రామాల వారీగా ఓటరు జాబితా రూపొందించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. రానున్న పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గురువారం కలెక్టరేట్‌లో ఓటరు జాబితా రూపకల్పనపై అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్‌తో కలిసి రెవెన్యూ, పంచాయతీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంట్ నియోజకవర్గ పరిధి ఓటరు జాబితా తీసుకుని అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా జీపీ ఓటర్ల నివేదిక తయారు చేయాలన్నారు. మార్పులు, చేర్పుల తర్వాత ఫైనల్ జాబితా ప్రకటిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా జాబితా తయారీపై మాస్టర్ ట్రెయినర్లు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. సమీక్షలో డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, డీఆర్డీఓ ఎన్.వసంత, ఆర్డీఓలు కొమురయ్య, వెంకన్న, కలెక్టరేట్ ఏఓ రవీందర్ పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు పరిశీలించండి

లే అవుట్(ఎల్‌ఆర్‌ఎస్) క్రమబద్ధీకరణకు వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆదేశించారు. ఈ మేరకు సంబంధిత అధికారులతో గురువారం నిర్వహించిన సమీక్ష అనంతరం కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు 2020 ఆగస్టు 26 నుంచి జిల్లాలో లే అవుట్ క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్నారని, జిల్లాలో 281 జీపీలు ఉండగా 151 గ్రామపంచాయతీల పరిధిలో మాత్రమే దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. చిల్పూర్, స్టేషన్‌ఘన్‌పూర్, జఫర్‌గఢ మండలాలు 'కుడా' పరిధిలో ఉన్నాయన్నారు. రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులతో పాటు పంచాయతీ కార్యదర్శులు బృందంగా ఏర్పడి ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ మేరకు సదరు అధికారులకు శిక్షణ ఇస్తామని చెప్పారు.

పెంపుడు కుక్కలకు టీకా వేయించాలి

పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి నిరోధక టీకా తప్పనిసరి వేయించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమంలో భాగంగా గురువారం గ్రేయిన్ మార్కెట్ ఏరియాలోని జిల్లా పశువైద్య, పశుసంవర్థక శాఖ కార్యాలయంలో కుక్కలకు రేబిస్ వ్యాధి నిరోధక టీకా శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కుక్క కరిస్తే ఆందోళన చెందకుండా ముందస్తు టీకా వేయిస్తే అందరికీ మంచిదన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయడం వల్ల వీధి కుక్కలు వచ్చే అవకాశం ఉందన్నారు. వీధి కుక్కలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో బయటకు వెళ్లిన పిల్లలు, వృద్ధులు, మహిళలు జాగ్రత్తగా ఇంటికి ఎలా రావాలో అవగాహన కలిగించాలని అన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లు, కళాశాలల వద్ద అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. కుక్కలు కనిపిస్తే వాటిని తన్నడం, రాళ్లతో కొట్టడం లాంటి పనులు చేయొద్దని సూచించారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా వీధికుక్కల సర్వే చేపట్టామని తెలిపారు. జిల్లా కేంద్రంలో ఎనిమల్ బర్త్ కేర్ సెంటర్ ప్రారంభించామని, ఇందులో కుక్కలకు ఆపరేషన్ చేస్తారని పేర్కొన్నారు. వీధికుక్కల దాడి సామాజిక సమస్య అని ప్రతీ ఒక్కరూ బాధ్యత తీసుకుంటేనే వాటి దాడి సంఘటనలను తగ్గించుకోవచ్చన్నారు. శిబిరంలో 54 కుక్కలకు టీకాలు వేశారు. పశుసంవర్థక శాఖ అధికారి డాక్టర్ ఎస్‌ఎల్‌ఎన్.మనోహర్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, డీఎంహెచ్‌ఓ రవీందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ వికాసానికి పరిశోధనలే గీటురాయి

కేయూ క్యాంపస్: సమాజ వికాసానికి పరిశోధనలే గీటురాయి లాంటివని కాకతీయ యూనివర్సిటీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అండ్ హెచ్‌ఆర్‌ఎం విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ జి.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. క్యాంపస్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అండ్ హెచ్‌ఆర్‌ఎం విభాగంలో పీహెచ్‌డీ పరిశోధకులతో ఆయన అమెరికా నుంచి వర్చువల్ గురువారం మాట్లాడారు. సమాజ వికాసానికి సామాజిక శాస్త్ర పరిశోధనలు చాలా ముఖ్యమని తెలిపారు. పరిశోధన అంశం ఎంపిక విషయంలో పరిశోధకులు శాస్త్రీయ పద్ధతిలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విభాగం కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీనివాసులు మాట్లాడుతూ డేటా సేకరణలో పరిశోధన పద్ధతులు, పరిశోధనపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. పరిశోధకులు పరిశోధనాపరంగా క్షేత్రస్థాయిలో పూర్తి సమాచారాన్ని నిబద్ధతతో సేకరించాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

పశుమిత్రలకు కనీస వేతనం అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న విజేందర్

జనగామ రూరల్: పశుమిత్రలకు కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సుంచు విజేందర్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పశుమిత్రలు ఏళ్ల తరబడి వెట్టిచాకిరీ చేస్తూ చాలీ చాలని రుసుముతో కాలం వెల్లదీస్తున్నారని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 50 మంది పశుమిత్రలను వర్కర్లుగా గుర్తించి కార్డులు ఇవ్వాలని కోరారు. స్వయం సహాయక సంఘాల్లోని చురుకైన సభ్యులను ఎంపిక చేసి శిక్షణ ఇచ్చి పశుమిత్రలుగా నియమించాలని కోరారు. కార్యక్రమంలో పశుమిత్రలు మంగ, సరళ, స్వరూప, సంధ్య, అనిత, మనీలా, స్వప్న, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం చిన్నబోయినపల్లి పంచాయతీ పరిధిలోని చింతలమోరి గొత్తికోయగూడెంలో మొక్కజొన్నలో కలుపు తీస్తున్న ఆదివాసీ దంపతులు



ఆదివాసీ.. అడవి నివాసి

అడవే ఆధారం.. బాహ్యప్రపంచంతో పెద్దగా సంబంధాలు లేని గూడేలు..మట్టి ఇళ్లు, గూన పెంకుల కప్పులు.. సంప్రదాయ పత్తి, మొక్కజొన్న పోడు వ్యవసాయం.. ఇవీ వీరి ఆస్తి. ఒకవైపు ఆధునిక టెక్నాలజీ అందుబాటులో ఉన్నా.. వాటిని పట్టించుకోరు. పాత పద్ధతులను అవలంబిస్తారు. పచ్చటి అడవిని నమ్ముకుని జీవనం సాగించడం వీరి ప్రత్యేకత. నేడు (శుక్రవారం) అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా కథనం 8లో

- ఏటూరునాగారం

క్లుప్తంగా

ప్రాణాపాయస్థితిలో గురుకుల విద్యార్థి

ములుగు రూరల్: మండలంలోని బండారుపల్లి గురుకుల పాఠశాల విద్యార్థి కార్తీక్ ప్రాణాపాయ స్థితిలో ఉన్నట్లు సమాచారం. ఈ నెల 2 తేదీన పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు కార్తీక్, ప్రణయ్ విష పురుగుల కాటుకు గురయ్యారు.దీంతో ఉపాధ్యాయులు ఆ విద్యార్థులకు ములుగు ఏరియా ఆస్పత్రిలో చికిత్స అందించి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. మెరుగైన వైద్యం కోసం హనుకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అయినా కార్తీక్ ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో హైదరాబాద్‌కు తరలించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ప్రణయ్ ఆరోగ్యం మెరుగుపడుందన్నారు.

'ఆర్టీసీ'లో ఆగిన అవ్వ గుండె



తొర్రూరు : ఆరోగ్యం క్షీణించింది.. ఆస్పత్రిలో చికిత్స పొందేందుకు గురువారం ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఓ వృద్ధురాలు ఆస్పత్రికి చేరక ముందే ప్రాణం విడిచింది. రాయపర్తి మండలంలోని పెర్కవేడు గ్రామానికి చెందిన వృద్ధురాలు మామిండ్ల గౌరమ్మ(70) ఆరోగ్య పరిస్థితి క్షీణించింది. దీంతో వెంటనే కుటుంబ సభ్యులు ఆటోలో రాయపర్తికి తరలించారు. అక్కడి నుంచి ఆర్టీసీ బస్సులో తొర్రూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకొస్తుండగా మార్గమధ్యలోకి వచ్చేసరికి గౌరమ్మ ఆరోగ్యం విషమించింది. దీంతో 108 అంబులెన్స్‌కు ఫోన్ చేయగా వైద్య సిబ్బంది వెంటనే వచ్చారు. అయితే వృద్ధురాలిని తొర్రూరులోని ఓ ఆస్పత్రికి తరలిస్తుండగా అప్పటికే మృతి చెందింది. దీంతో మృతురాలి కుమారులు, కుమార్తె, బంధువులు కన్నీరు మున్నీరుగా రోదించారు.

గుండె 'గుడి'లో భార్య



పొలం వద్ద కట్టిన గుడి



సరస్వతి విగ్రహం

కొత్తగూడ: ఇంటికి ఇల్లాలు వెలుగు. అలాంటి ఇల్లాలు మధ్యలోనే ఆ కుటుంబాన్ని విడిచిపెట్టి అనంతలోకాలకు వెళ్లింది. భార్యపై ఉన్న ప్రేమానురాగాలను, అనుబంధాన్ని మరిచిపోలేని భర్త ఆమెకు గుడి కట్టి అందులో విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం ఓటాయి గ్రామానికి చెందిన కుడికాల రమేశ్ భార్య సరస్వతి ఏడాదిక్రితం అనారోగ్యంతో చనిపోయింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. సరస్వతి భౌతికంగా లేకపోయినా ఆమె జ్ఞాపకాలు గుర్తుండేలా రమేశ్ తన వ్యవసాయ పొలం వద్ద గుడి కట్టారు. అందులో సరస్వతి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుని గురువారం ప్రారంభించారు. 'నా భార్య అంటే ఎంతో ప్రేమ. ఆమెతో ఉన్న అనుబంధాన్ని మరిచిపోలేము. అందుకే గుర్తుగా గుడి కట్టి విగ్రహం పెట్టించాను' అని రమేశ్ కన్నీటిపర్యంతమయ్యాడు.

అడవి బిడ్డ అరణ్య రోదన..

నేటికీ మారని ఆదివాసీల దుర్భర పరిస్థితులు

- రవాణా మార్గం లేని గూడేలు ఎన్నో
- విద్య, వైద్యం కోసం నానాటికీ పోరాటాలే
- హక్కులు, చట్టాలను కాపాడుకునేందుకు పాట్లు
- ఇప్పటికీ పోడు వ్యవసాయమే దిక్కు
- 1986లో ఐటీడీఏ ఏర్పాటైనా అభివృద్ధి శూన్యం..
- నేడు అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం



మీరు చూస్తున్న ఊరు పేరు చింతలమోరి. ఇది పూర్తిగా ఆదివాసీ గొత్తికోయగూడెం. ఇక్కడ బడి లేదు.. ప్రభుత్వ దవాఖానలేదు. సరైన రోడ్డు లేక అడవిలో నుంచి నడుచుకుంటూ ఆ గూడేనికి చేరుకోవాలి. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం చిన్నబోయినపల్లి పంచాయతీ పరిధిలోని గూడెం చింతలమోరి. గొత్తికోయలు ఛత్తీస్‌గఢ్ నుంచి 20 ఏళ్ల క్రితం వలస వచ్చి బతుకుజీవుడా అంటూ ఇక్కడే పోడు వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నారు. రిజర్వ్ ఫారెస్ట్ కావడంతో అక్కడ శాశ్వత నిర్మాణాలు, సౌకర్యాలు చేపట్టలేకపోతున్నామని ప్రభుత్వాలు చెబుతున్నాయి. ఫలితంగా అడవి బిడ్డలు మట్టి ఇళ్లు, గూనపెంకుల కప్పుతో కాలం వెళ్లదీస్తున్నారు. ఎలాంటి విద్యుత్ సరఫరా ఉండదు. కేవలం నెగళ్లు, కాగడాలు, సోలార్ లైట్లతోనే వారు కాలం వెళ్లదీస్తున్నారు. కాగా, ప్రస్తుతం అక్కడ పీపుల్స్ హెల్పింగ్ చిల్డ్రన్ స్వచ్ఛంద సంస్థ ద్వారా ఓ గుడిసెలో ప్రైవేట్ పాఠశాల ఏర్పాటు చేసి అందులో టీచర్‌ను నియమించి విద్యాబోధన చేస్తున్నారు. పత్తి, మొక్క జొన్న సాగు చేస్తూ వచ్చిన పంటలో కొంత అమ్ముకుని తినడానికి కొంత నిల్వ చేసుకుంటారు. వారికి ఎరువులు, పురుగుల మందుల వినియోగం తెలియదు. కేవలం మేక, పశు ఎరువు వినియోగిస్తూ పంటలు పండిస్తున్నారు. కనీసం ఎడ్లు కూడా లేకపోవడంతో భార్యాభర్తలు కలిసి కలుపుతీసేందుకు నాన తంటాలు పడుతున్నారు. ఇలాంటి జీవన చిత్రాలు ఏజెన్సీలో అనేకం ఉన్నాయి అంటే అతియోశక్తికాదు.

ఏటూరునాగారం : ఆదివాసీ.. భారతదేశ ప్రాచీన తెగ. ఈ అడవి బిడ్డల ఆచారాలు.. వ్యవహారాలు, కట్టూ.. బొట్టూ, వేషధారణ.. వస్త్రధారణ పూర్తిగా ఇతరులకు భిన్నం. మైదానం ప్రాంతంలో సంబంధం లేకుండా పూర్తిగా అడవితల్లితో పెనవేసుకున్న బంధం వీరిది. అడవిలో లభించే ఆకులు, దుంపలే పరమాన్నం. పోడు వ్యయసాయమే జీవనాధారం. అయితే ఎన్ని ప్రభుత్వాలు.. ఎందరు పాలకులు మారినా వీరి దుర్భర పరిస్థితులు మారడం లేదు. ఎన్ని పథకాలు పెట్టినా.. ఎంత బడ్జెట్ కేటాయించినా చివరి వరకు చేరకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగా మారింది. ఈ క్రమంలో నేడు (శుక్రవారం) అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆదివాసీలు ఎదుర్కొంటున్న దుర్భర పరిస్థితులు.. ఆచార వ్యవహారాలు, ఆహారపు అలవాట్లు, సమస్యలపై 'సాక్షి' కథనం.

గిరిజనాభివృద్ధి కోసమే ఏర్పాటు

ఆదివాసీల అభివృద్ధే ధ్యేయంగా ఏటూరునాగారంలో 1986లో సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థను ఏర్పాటు చేశారు. ప్రాజెక్టు అధికారి(పీఓ) పాలనలో 29 శాఖలకు అధికారులు, సిబ్బంది పనిచేస్తారు. వీరంతా ఆదివాసీల అభివృద్ధి కోసమే పనిచేయాల్సి ఉంది. అయితే కార్యాలయం ఉన్నప్పటికీ ఆదివాసీల బతుకుల్లో వెలుగులు నింపలేకపోతోంది. ఈనాటికి కూడా గూడేలకు రవాణాసౌకర్యాలు లేవంటే పాలకులకు పని తీరు అర్థం చేసుకోవచ్చు. ఊరట్టం- కొండాయి మధ్య రోడ్డు బురదమయంగా మారడంతో గ్రామస్తులు దినదినగండంగా బతుకుతున్నారు. కన్నాయిగూడెం మండలం ఐలాపురానికి ఇప్పటి వరకూ శాశ్వత రోడ్డు లేదు. కేవలం మట్టి రోడ్డుతో వాగులు, వంకలు దాటుకుంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఇలా అనేక గ్రామాలు ఉన్నాయి.

ఐటీడీఏ పరిధిలో..

ఏజెన్సీ మండలాలు	13
గ్రామాలు	177
గ్రామ పంచాయతీలు	83
మొత్తం జనాభా	1,86,607
ఇళ్లు	48,052
పురుషులు, స్త్రీలు	82,088

చట్టాలు, సంప్రదాయాలు

5వ షెడ్యూల్డ్ ప్రాంతంలో ఆదివాసీలకు రక్షణగా 1/70, పెసా చట్టం, అడవి హక్కుల గుర్తింపు చట్టం (2006) ఉంది. అయినా వనరులు దోపిడీకి గురవుతున్నాయని నానాటికీ ఆదివాసీలు పోరాటం చేస్తూనే ఉన్నారు. చట్టం అమల్లోకి వచ్చిన సమయంలో తెలంగాణ రాష్ట్రంలో 42 లక్షల ఎకరాలకు హక్కు పత్రాలు ఇవ్వాలని గుర్తించారు. కానీ కేవలం 3.31 లక్షల మందికి మాత్రమే హక్కు పత్రాలు ఇచ్చారు. ఇటీవల జిల్లాలో 6,546 మందికి మందికి పోడు పట్టాలు అందజేశారు.

ప్రతీ పండుగ ప్రత్యేకత

కోయల్లో పుట్టుక, పురుడు నేల మీదే జరుగుతుంది. మంత్రసానిలు ఉంటారు. పుట్టిన వెంటనే పిల్లలకు కలి చల్లుతారు. మూడో రోజు ముడి దొండాకు పసరు పోస్తారు. బాలింతలకు ఉప్పు చెక్క, పెద్ద చెట్ల మందు పోస్తారు. పురుడు చేయడం ఆచారం. 11, 13, 15 రోజుల్లో పేర్లు పెట్టడం, 21వ రోజు తొట్టెలో వేసి బారసాల చేయడం ఆచారం. పిల్లల పేర్లు ఇలవేల్పు సమ్మక్క పేరుమీదే ఎక్కువ



పాఠం చెబుతున్న టీచర్ సాయి స్నేహ

ఉంటాయి. నాగదేవత మీద, తాజాగా రాముడు, వెంకటేశ్వర్లు వంటి హిందూ దేవుళ్ల మీద కూడా నామకరణం చేస్తున్నారు. కోయ పండుగలు విభిన్నంగా.. విశిష్టంగా ఉంటాయి. ప్రధానంగా ఆరు రకాల పండుగలు చేసుకుంటారు. భూమి పండుగ లేదా విత్తు పండుగ , నూరాల పండు, నుంకుల పండుగా చేసుకుంటారు. పొట్ట పండుగ లేదా వెన్నుగంటి పండుగ, -కొత్తల పండుగ, పెద్దల పండుగ, సమ్మక్క పండుగ, మండ మెలిగె, రెండేళ్లకోసారి చేసే సమ్మక్క పండుగలను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.



వెదురుతో తయారు చేసిన ఊయలలో చిన్నారిని ఊపుతున్న తల్లి

జెనీవాలో గుర్తింపు

ప్రపంచంలోని అన్ని దేశాలు ఆదివాసీ సంరక్షణకు కృషి చేయాలనే ఉద్దేశంతో ఆదివాసీ హక్కులు, సంస్కృతి, సంప్రదాయాల రక్షణకు ఐక్యరాజ్యసమితి చర్యలు తీసుకుంది. 1982 ఆగస్టు 9న స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో 26 మంది స్వతంత్ర మానవ హక్కుల ప్రతినిధులతో వర్కింగ్ గ్రూప్ సమావేశం నిర్వహించింది. ఇందులో భాగంగా ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవంగా జరుపుకోవాలని తీర్మానించి ఆమోదించింది. అప్పటి నుంచి ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

అడవుల్లో దొరికినవి అమ్ముతాం



అడవుల్లో దొరికేవి మేము తెచ్చుకొని అమ్ముకుంటాం. వచ్చిన డబ్బుతో కిరాణ సామాను, బట్టలు కొనుక్కుంటాం. ప్రభుత్వం నుంచి మాకు ఎలాంటి సాయం అందడం లేదు. ఆదుకుని ఉపాధి కల్పించాలి. - రవ్వ ఐతే, చింతలమోరి

రోడ్డు సౌకర్యం కల్పించాలి



చింతలమోరికి రోడ్డు లేదు. రోడ్డు సౌకర్యం కల్పించాలి. మేము ఎటైనా పోతే నడుచుకుంటూ పోవాలి. రోడ్డు లేక ఎలాంటి వాహనం వచ్చే పరిస్థితి లేదు. పిల్లలను బడికి పంపడానికి కూడా ఇబ్బంది పడుతున్నాం. రోడ్డు ఏర్పాటు చేసి రవాణా సౌకర్యం చూడాలి. - కోస బీమా, చింతలమోరి

ఫలాలపై దృష్టి

అటవీ ఉత్పత్తుల ఫలసాయంపైనే ఆదివాసీలు దృష్టిసారిస్తారు. అడవిలో లభించే చీపుర్లు, ఉసిరికాయలు, పుట్టగొడుగులు, తునికికాయలు, పాలపండ్లు, పూసుకుకాయలు, బోడకాకర, తేనె, బంక, ఇప్ప పలుకులు, ఇప్ప పూలు విక్రయిస్తారు. వచ్చిన సొమ్ముతో సామగ్రి, ఇతర వస్తువులు కొనుగోలు చేసుకుంటారు.



పుట్టగొడుగులు విక్రయిస్తున్న గిరిజన మహిళ





పత్తిచేనులో కలుపుతీస్తున్న బాలిక, గూడేనికి కొత్త వ్యక్తి వచ్చాడని భయంగా చూస్తున్న మహిళ

హైకోర్టు ఏజీపీగా రూహీ నబీల

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



రూహీ నబీల

వరంగల్ లీగల్ : హనుమకొండ జిల్లా కేంద్రానికి చెందిన రూహీ నబీలను తెలంగాణ హైకోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ)గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. రూహీ ఇంటర్మీడియట్ వరకు హనుమకొండలో, ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం ఉస్మానియా యూనివర్సిటీలో చదివారు. తన తండ్రి మహమూద్ వరంగల్ జిల్లా కోర్టులో న్యాయవాదిగా, ప్రభుత్వ న్యాయవాదిగా పనిచేశారు. తండ్రి బాటలో నడిచి 2016లో తెలంగాణ బార్ కౌన్సిల్‌లో తన పేరు నమోదు చేసుకుని న్యాయవాదిగా మొదట వరంగల్ కోర్టులో పనిచేశారు. ఉన్నత లక్ష్యాలు చేరుకోవడం కోసం తెలంగాణ రాష్ట్ర హైకోర్టులో ప్రాక్టీస్ మొదలు పెట్టారు. ఈ సందర్భంగా రూహీ నబీల మాట్లాడుతూ తనకు అప్పగించిన విధులను ఎలాంటి పక్షపాతం, తారతమ్యం లేకుండా నిర్వర్తిస్తానన్నారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించిన న్యాయ అధికారులు, ప్రభుత్వ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా, రూహీ నియామకంపై కేసముద్రం మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సంజీవరెడ్డి, కాంగ్రెస్ నాయకులు సూరపనేని నాగేశ్వరరావు, మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆనంద్‌మోహన్, వరంగల్ అసోసియేషన్ అధ్యక్షుడు జీవన్‌గౌడ్, బార్ అసోసియేషన్ నాయకులు స్వప్న, రమాదేవి, న్యాయవాదులు, తదితరులు అభినందనలు తెలిపారు.

సీఎస్సీ హెల్త్‌కేర్‌లో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

హన్మకొండ అర్బన్ : సీఎస్సీ హెల్త్ కేర్ సంస్థలో ఫ్లెబోటమిస్ట్ ఉద్యోగాల కోసం ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీఎస్సీ హెల్త్‌కేర్ సీనియర్ హెచ్‌ఆర్ ఎగ్జిక్యూటివ్ మామిడాల కావ్య ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఎంఎల్‌టీ / డీఎంఎల్‌టీ / బీఎస్సీ ఎంఎల్‌టీ/ ఏఎన్‌ఎం/ జీఎన్‌ఎం కోర్సులు పూర్తి చేసి ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్, జిరాక్స్ కాపీలు తీసుకుని ఈనెల 10,11,12 తేదీల్లో నగరంలోని కాజీపేట ఫాతిమానగర్‌లోని పీఎఫ్ ఆఫీస్ రోడ్డులో గల సీఎస్సీ హెల్త్‌కేర్ బిల్డింగ్‌లో జరిగే ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 63049 87190, 83281 98025 నంబర్లలో సంప్రదించాలని వివరించారు.

నెక్కొండలో ఇంటర్‌సిటీ, జమ్మికుంటలో యశ్వంత్‌పూర్‌కు హాల్టింగ్

కాజీపేట రూరల్: కాజీపేట, వరంగల్ రైల్వే స్టేషన్ల మీదుగా ప్రయాణించే ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అప్ అండ్ డౌన్ రూట్‌లో నెక్కొండ, జమ్మికుంట రైల్వే స్టేషన్లలో ప్రయోగాత్మకంగా హాల్టింగ్ సౌకర్యం కల్పించినట్లు రైల్వే అధికారులు గురువారం రాత్రి తెలిపారు. సికింద్రాబాద్-గుంటూరు (12706) ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, గుంటూరు-సికింద్రాబాద్ (12705) ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్ల సర్వీస్‌లను ఆగస్టు 8వ తేదీ నుంచి ఆరు నెలల పాటు ప్రయోగాత్మకంగా నడిపిస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు 8వ తేదీ నుంచి గోరఖ్‌పూర్-యశ్వంత్‌పూర్ (12591) యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్, ఆగస్టు 12వ తేదీ నుంచి యశ్వంత్‌పూర్-గోరఖ్‌పూర్ (12592) గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల సర్వీస్‌లకు ఆరు నెలల పాటు నడిపిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

సుంకిశాలపై సమగ్ర విచారణకు ఆదేశించాం

- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

ఎల్కతుర్తి: సుంకిశాలపై సమగ్ర విచారణకు ఆదేశించామని, రిపోర్టు తెప్పించుకుని గత ప్రభుత్వ హయాంలో ఎవరైతే బాధ్యులు ఉన్నారో వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ స్పష్టం చేశారు. గురువారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ సంకిశాల గోడ పని జరిగింది బీఆర్‌ఎస్ హయాంలోనేనని తెలిపారు. కూలిన ఘటనలో పూర్తిగా దోషి అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వమే అని ఆరోపించారు. దీనిపై విచారణకు సిద్ధమేనా..? అని సవాల్ విసిరారు. ప్రజలను తప్పుదోవ పట్టించడం కాదన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు మసిపూసి బట్టకాల్చి మీదపడేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. సుంకిశాలపై ప్రాథమిక రిపోర్ట్ రాగానే ప్రజలముందు ఉంచుతామన్నారు. కాళేశ్వరానికి సంబంధించి లోపభూయిష్ట నిర్ణయాలతో ప్రజలకు నష్టం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి అమెరికా పర్యటన వ్యక్తిగతం కాదని, అధికారిక పర్యటన అని తెలిపారు. రాష్ట్ర చీఫ్ సెక్రటరీతోపాటు ఫైనాన్స్ సెక్రటరీ, ఐటీ, పరిశ్రమలకు సంబంధించిన అధికారులతో కలిసి అనేకమంది పారిశ్రామికవేత్తలను కలుస్తున్నారన్నారు. ప్రభుత్వ పర్యటనలో రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించి అనేక అంశాలపై ముందడుగు పడుతుంటే కుటుంబపరమైన అంశాలు ప్రస్తావిస్తూ చులకన చేసే ప్రయత్న చేస్తున్నారని ధ్వజమెత్తారు. పదేళ్ల సీఎంగా కొనసాగిన కేసీఆర్ కేవలం ఫాంహౌజ్‌కే పరిమితమయ్యారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మంచి చేస్తే బీఆర్‌ఎస్ నేతలకు కళ్లమంటలాగా కనిపిస్తోందని అన్నారు. ప్రజాపాలన పేరుతో రాష్ట్రాని బాగుచేయాలని ఆలోచనతో ఉన్న ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రిని బీఆర్‌ఎస్ విమర్శిస్తున్న తీరును ప్రజలు గమనించాలని కోరారు. కేటీఆర్ అనేక సందర్భాల్లో విదేశీ పర్యటనలు చేశారని, ఒక్కసారి కూడా నిధులు తీసుకురాలేదని ఆరోపించారు. బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగితే మాట కూడా మాట్లాడడం చేతకాని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అని విమర్శించారు.

పురాతన ఆలయాలకు పూర్వవైభవం

- నిరాదరణకు గురైన కాకతీయుల ఆలయాల పునరుద్ధరణకు చర్యలు
- రాష్ట్ర దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్
- 'సాక్షి' కథనానికి స్పందన
- కలెక్టర్ సత్యశారదతో కలిసి ఆలయాల పరిశీలన



మధ్యకోటలో పురాతన ఆలయాలను పరిశీలిస్తున్న రాష్ట్ర దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్, కలెక్టర్ సత్యశారద

ఖిలా వరంగల్ : కాకతీయుల కాలం నాటి పురాతన దేవాలయాలను పునరుద్ధరించి చారిత్రక కోట పూర్వవైభవానికి చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రెవెన్యూ, దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ అన్నారు. 'కళాసంపద.. కనుమరుగు' అనే శీర్షికతో 'సాక్షి'లో గురువారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గురువారం మధ్యకోటలో రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ హనుమంత రావు, వరంగల్ కలెక్టర్ సత్యశారద, జిల్లా అటవీ శాఖ అధికారి అనుజ్ అగర్వాల్ కేంద్ర, రాష్ట్ర పురావస్తుశాఖ అధికారులతో కలిసి రాష్ట్ర రెవెన్యూ, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ పర్యటించారు. ఈ సందర్భంగా మండలమ్మ గుడి, నేలశంభునిగుడి, ఏకశిలగుట్టపై రాముడి పాదాలు, త్రికుటాలయాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. శిథిలావస్థలో ఉన్న ఆలయాల పునరుద్ధరణ సాధ్యసాధ్యాలపై కేంద్ర, రాష్ట్ర పురావస్తుశాఖ, సంబంధిత శాఖల అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా శైలజారామయ్యర్ మాట్లాడుతూ ఇటీవల మంత్రి కొండా సురేఖ అధికారులతో కలిసి కోటలో పర్యటించి కాకతీయుల కాలం నాటి పురాతన ఆలయాల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారని తెలిపారు. మంత్రి ఆదేశాల ప్రకారం క్షేత్రస్థాయిలో సందర్శించి పరిశీలించామన్నారు. కేంద్ర పురావస్తుశాఖకు సంబంధించిన 14 ఆలయాలు, రాష్ట్ర పురావస్తుశాఖకు సంబంధించిన ఒక ఆలయాన్ని పరిశీలించామని తెలిపారు. ప్రముఖ చరిత్రకారులు, నిపుణులతో కమిటీ ఏర్పాటు చేసి ఆలయాల పునరుద్ధరణ చేపడుతామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఏఎస్పై డీఈ చంద్రకాంత్, ఏఈ కృష్ణ చైతన్య, జేసీఏ మడిపెల్లి మల్లేశం, ఏడీ మల్లునాయక్, ఇంటెక్ కోకన్వీనర్ ప్రొఫెసర్ పాండురంగారావు, దేవాదాయశాఖ సహాయ కమిషనర్ సునీత, 'కుడా' పీఓ అజిత్‌రెడ్డి, తహసీల్దార్ బండి నాగేశ్వరరావు, కార్పొరేటర్లు బైరబోయిన ఉమ, వేల్పుగొండ సువర్ణ, మాజీ కార్పొరేటర్ దామోదర్‌యాదవ్, టీఎస్‌టీడీసీ ఏఈ విజయ్, ఇన్‌చార్జ్ అజయ్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాల ఏర్పాటుపై కమిటీ

హన్మకొండ కల్చరల్ : పురావస్తుశాఖ పరిధిలో ఉన్న ఖిలా వరంగల్ కోటలోని దేవాలయాల్లో విగ్రహాల ఏర్పాటుపై కమిటీ ఏర్పాటు చేసి చర్చించాలని శైలజా రామయ్యర్ ఆదేశించారు. హనుమకొండ హరిత కాకతీయ హోటల్‌లో పురావస్తు శాఖ అధికారులతో సమీక్షించారు. జిల్లా పురావస్తుశాఖ అధికారి మల్లేశం మాట్లాడుతూ పురావస్తుశాఖ నిబంధనల మేరకు కొత్తగా విగ్రహాలను ఏర్పాటు చేయరాదని, దీనిని పరిశీలించాలన్నారు.

భద్రకాళి సన్నిధిలో శైలజారామయ్యర్

వరంగల్ భద్రకాళి దేవాలయాన్ని రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, దేవాదాయశాఖ కమిషనర్ మంత్రిప్రగడ హనుమంతరావు, వరంగల్ కలెక్టర్ సత్య శారద గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఈఓ శేషుభారతి, అర్చకుడు భద్రకాళి శేషు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి పూజలు జరిపారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఆలయ ప్రాంగణంలో కదంబం, మామిడి, నేరేడు మొక్కలు నాటారు.

పదోన్నతులకు లైన్ క్లియర్..

- సంతోషంలో విద్యుత్ ఉద్యోగులు
- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సానుకూలం
- యూనియన్, అసోసియేషన్ నేతలతో ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి సమావేశం

హన్మకొండ: విద్యుత్ సంస్థల్లో పదోన్నతులకు ప్రభుత్వం నుంచి లైన్ క్లియర్ అయింది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క సానుకూలం వ్యక్తం చేయడంతో ఇప్పటి వరకు పదోన్నతులు జరుగుతాయో లేదోననే ఆందోళనలో ఉన్న ఉద్యోగుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. తెలంగాణ పవర్ జేఏసీతో పాటు, ఆయా ఉద్యోగ యూనియన్లు ముందు పదోన్నతులు చేపట్టి ఆ తర్వాతే బదిలీలు చేపట్టాలని, లేని పక్షంలో ఆందోళనలు చేపట్టడంతోపాటు అవసరమైతే సమ్మెకు వెళ్తామనే హెచ్చరికలు చేస్తూ యాజమాన్యాలకు నోటీసులు అందజేశాయి. ఈ అంశాన్ని విద్యుత్ సంస్థల చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్లు ఉపముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లగా ఆయన పదోన్నతులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ క్రమంలో గురువారం రాత్రి హనుమకొండలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో విద్యుత్ ఉద్యోగుల యూనియన్లు, అసోసియేషన్ల నాయకులతో చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్‌రెడ్డి సమావేశమయ్యారు. పదోన్నతులు నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నామని, యూనియన్లు, అసోసియేషన్లు సహకరించాలని సూచించారు. కండీషన్స్ పెట్టి పదోన్నతులు కల్పిస్తామని తెలిపారు.

బీసీ అసోసియేషన్ అభ్యంతరం..

ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు పాత పద్ధతిలో రిజర్వేషన్ కమ్ సీనియారిటీ ప్రకారం పదోన్నతులు చేపట్టాలని కోరగా బీసీ అసోసియేషన్ నాయకులు అభ్యంతరం తెలిపారు. మెరిట్ కమ్ సీనియారిటీ పద్ధతిలోనే చేపట్టాలని కోరారు. దీంతో సీఎండీ వరుణ్ రెడ్డి మీరంత కలిసి ఒక నిర్ణయానికి వస్తే ప్రక్రియ కొనసాగుతుందని స్పష్టం చేసి సమావేశం ముగించారు.

ఆశ తీరకుండానే రిటైర్మెంట్..

కొన్నేళ్లుగా పదోన్నతులు లేకపోవడంతో 20 ఏళ్లుగా ఒకే పోస్టులో కొనసాగుతూ ఇవాలో.. రేపో పదోన్నతి రాకపోతుందా అని ఎదురుచూసి చివరకు ఆశ తీరకుండానే కొందరు ఉద్యోగులు రిటైర్డ్ అయ్యారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఇంజనీర్లు రావడంతో రాష్ట్రానికి చెందిన ఇంజనీర్లు పదోన్నతులు కోల్పోయారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఏడీఈలు సీనియర్లు కావడంతో వారికి పదోన్నతులు కల్పించారు. దీంతో స్థానికత కలిగి ఉండి ఎన్నో ఏళ్లుగా ఎన్పీడీసీఎల్‌లో పని చేస్తున్న 12 మంది సీనియర్ అసిస్టెంట్ డివిజన్ ఇంజనీర్ల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. కొందరికి రివర్షన్ ఇచ్చారు. ఆదిలాబాద్ ఎస్ఈగా పని చేస్తున్న జడ్.ఉత్తమ్ డీఈగా రివర్షన్ పొందారు. డీఈలుగా పని చేస్తున్న ఉపేందర్, ఇ.వాసుదేవ్‌కు ఏడీఈలుగా రివర్షన్ ఇచ్చారు. సీజీఎం హోదాలో సీజీఆర్ఎఫ్‌లో అకౌంట్స్ మెంబర్‌గా పని చేస్తున్న చరణ్‌దాస్‌కు జీఎంగా రివర్షన్ ఇచ్చారు. వచ్చిన వారు సీనియర్లు కావడంతో స్థానికులు సీనియారిటీలో వెనుకబడ్డారు.

సొంత ప్రాంతానికి వెళ్లిన 14 మంది ఉద్యోగులు..

ఎస్సీ, ఎస్టీ ఇంజనీర్లు తిరిగి సొంత ప్రాంతానికి వెళ్లడానికి సుప్రీం కోర్టు అవకాశం కల్పించగా 14 మంది వెళ్లారు. దీంతో వెళ్లిపోయిన వారిలో ఎస్సీ, ఎస్టీలైన ఆరుగురు డివిజన్ ఇంజనీర్లు, ఆరుగురు అసిస్టెంట్ డివిజన్ ఇంజనీర్లు, ఒక సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్, ఒక్క సూపరింటెండెంట్ ఇంజనీర్ ఉన్నారు. ఈ పోస్టులు ఖాళీ కావడంతో మరోసారి స్థానిక ఏడీఈల్లో తమకు పదోన్నతులు లభిస్తాయనే ఆశలు చిగురించాయి. ఈ క్రమంలో మెరిట్ కమ్ సీనియారిటీ, రిజర్వేషన్ కమ్ సీనియారిటీ అంశం సమస్యగా పరిణమించింది. దీంతో పాటు మరో అంశం కోర్టుకు చేరింది. కోర్టులో కేసులు ఉండడంతో యాజమాన్యం పదోన్నతుల ప్రక్రియకు ముందుకు రాలేదు. మరో వైపు బదిలీలకు మార్గదర్శకాలు సిద్ధం చేయడంతో.. బదిలీలు చేస్తే పదోన్నతుల ప్రక్రియ నిలిచిపోతుందని, ఉద్యోగులు, ఇంజనీర్లకు నష్టం జరుగుతుందని యూనియన్లు, అసోసియేషన్లపై ఒత్తిడి పెరిగింది. ఎలాగైనా పదోన్నతులు కల్పించేలా యాజమాన్యంపై ఒత్తిడి తేవాలని ఉద్యోగుల నుంచి డిమాండ్ పెరిగింది. ఈ క్రమంలో ఉద్యోగుల జేఏసీ, యూనియన్లు నోటీసులు ఇవ్వడంతో పాటు అవసరమైతే కోర్టు తీర్పుకు లోబడి కండీషన్‌తోనైనా పదోన్నతి కల్పించాలని సలహా ఇచ్చాయి. ఈ క్రమంలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పదోన్నతులు కల్పించనున్నట్లు తెలుపడంతో మరోసారి ఆశలు చిగురించాయి. పదోన్నతులు కల్పిస్తే ఖాళీలపై స్పష్టత వస్తుందని, తర్వాత బదిలీలు జరిపితే ఖాళీలు భర్తీ చేయడానికి మార్గం సుగమవుతుందని యూనియన్, అసోసియేషన్ నాయకులు తెలిపారు.